క్రీడలను ప్రారంభిస్తున్న జిల్లా స్పోర్ట్స్ అధికారి తుల రవి

ముగిసిన సీఎం కప్ క్రీడలు

ములుగురూరల్, డిసెంబర్ 22 : జిల్లాలో సీఎం కప్ క్రీడలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలను గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్, జిల్లా స్పోర్ట్స్ అధికారి తుల రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా రవిచందర్ మాట్లాడుతూ మంత్రి సీతక్క, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ సహకారంతో స్పోర్ట్స్ స్కూల్, క్రీడా మైదానం కోసం భూమి మంజూరు చేసినట్లు చెప్పారు. జిల్లాలోని క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయిలో సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై-3 లక్ష్మారెడ్డి, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు జక్కుల రేవంత్‌యాదవ్, నాయకులు లక్కి, అధికారులు, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ పోటీలకు మైనార్టీ కళాశాల విద్యార్థిని ఎంపిక

వెంకటాపూర్, డిసెంబర్ 22 : మండలంలోని మైనార్టీ కళాశాల విద్యార్థిని ఏ రుచిత రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ వందన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రుచిత జాకారంలో నిర్వహించిన పోటీల్లో అండర్-20 బాలికల 8 కిలోమీటర్ల విభాగంలో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని తెలిపారు. రుచితను ప్రిన్సిపాల్‌తో పాటు పీడీ నవ్య, కళాశాల బృందం అభినందించారు.

పోటీలకు ఎంపికైన రుచిత

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు

మహదేవపూర్ (కాళేశ్వరం), డిసెంబర్ 22 : మండలంలోని పల్గుల, మద్దులపల్లి, కుంట్లం గ్రామాల్లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 150 మందిని పరీక్షించి మందులను పంపిణీ చేశారు. పలువురికి ఉచిత ఆపరేషన్‌కు రిఫర్ చేశారు. కార్యక్రమంలో అప్తాలమిస్ట్ ఆఫీసర్ సతీశ్ కుమార్, మాజీ సర్పంచ్ బాపురెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రాకేశ్, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది, ఆర్ఎంపీలు, లయన్స్ క్లబ్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

చిట్యాల, డిసెంబర్ 22 : రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన మండల కేంద్ర శివారులోని కోసూరుపల్లి గ్రామ ప్రధాన రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. భూపాలపల్లి మండలం గొర్లవీడు గ్రామానికి చెందిన ఆర్ఎంపీ తాళ్ల మార్కండేయ మండలంలోని రామచంద్రపురం గ్రామంలో ఓ వివాహ వేడుకకు హాజరై బైక్‌పై తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో నైన్‌పాక గ్రామానికి చెందిన బైరి శంకర్ ద్విచక్ర వాహనంపై మండలకేంద్రం వైపు వెళ్తున్నాడు. ఆయన వెనుకాలే వెళ్తున్న మార్కండేయ శంకర్ ద్విచక్ర వాహనానికి ఢీకొట్టి అదుపుతప్పి కిందపడిపోయాడు. మార్కండేయ తలకు తీవ్ర గాయాలతో రక్తస్రావమైంది. విషయం తెలుసుకున్న ఎస్సై శ్రావణ్‌కుమార్ అక్కడికి చేరుకొని క్షతగాత్రుడిని స్థానిక సివిల్ దవాఖానకు తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించినట్లు తెలిపారు. స్వల్ప కాలంలోనే స్పందించి దవాఖానకు తరలించి మానవత్వం చాటుకున్న ఎస్సైని, కానిస్టేబుల్ లాల్ సింగ్ ను మండల వాసులు అభినందించారు.

క్షతగాత్రుడిని చిట్యాల సివిల్ దవాఖానలో చేర్పిస్తున్న ఎస్సై శ్రావణ్ కుమార్

సింగరేణి ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

పరిశీలించిన జీఎం రాజేశ్వర్‌రెడ్డి

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 22 : స్థానిక అంబేద్కర్ స్టేడియంలో నేడు నిర్వహించనున్న సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సింగరేణి ఏరియా అధికార ప్రతినిధి కావూరి మారుతి తెలిపారు. ఆదివారం జీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరుకానున్నట్లు తెలిపారు. అతిథులు, అధికారులు, కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు జీఎం కార్యాలయంలో జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి జెండా ఆవిష్కరించి, అనంతరం అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించనున్న ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొంటారన్నారు. రెస్క్యూ, వీటీసీ, మెడికల్, సేవా సమితి, కమ్యూనికేషన్, ఎన్విరాల్‌మెంట్, బ్రహ్మకుమారి, పిరమిడ్, ఖాదీ, టైడ్స్ ఆధ్వర్యంలో మొత్తం పది రకాల స్టాల్స్, ఏడు రకాల ఫుడ్స్ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించిన వెల్ బేబీ షో, ముగ్గుల పోటీలు, ఉత్తమ గృహాలంకరణ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. కేటీకే-6 ఇంక్లైన్‌లో హెచ్‌వోఎంగా విధులు నిర్వర్తిస్తున్న చిదురాల అనిల్‌కుమార్, కేటీకే ఓసీ-2లో సర్వేయర్‌గా పనిచేస్తున్న పిస్క శ్రీకాంత్, కేటీకే-1 ఇంక్లైన్‌లో అండర్ మేనేజర్‌గా పనిచేస్తున్న వేమూరి కిషన్ కాంత్, కేటీకే-5 ఇంక్లైన్‌లో అండర్ మేనేజర్‌గా పనిచేస్తున్న పెద్దపాటి అభిషేక్‌ను ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేసినట్లు తెపారు. వారికి ఎమ్మెల్యే చేతుల మీదుగా అవార్డులు అందజేయనున్నట్లు మారుతి వివరించారు. సింగరేణి పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, కార్మికులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఏర్పాట్ల పరిశీలించిన జీఎం

ఆవిర్భావ వేడుకలకు అంబేద్కర్ స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను జీఎం రాజేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని ఆదేశించారు. భూపాలపల్లి ఏరియాలో ఉత్పత్తి ఉత్పాదకతను పెంచడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. గైర్హాజరు శాతాన్ని తగ్గించి ఉత్పత్తిని పెంచుతున్నామని తెలిపారు. త్వరలో సయస్యలన్నీ తీరిపోయి అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటామని వివరించారు. అనంతరం క్రీడాకారులతో కలిసి జీఎం క్రికెట్ ఆడారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు, కార్మికులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అంబేద్కర్ క్రీడా మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జనరల్ మేనేజర్ రాజేశ్వర్ రెడ్డి

ర్యాలీలో పాల్గొన్న ఆదివాసీలు, సంఘాల ప్రతినిధులు

పోరాటాలతోనే వర్గీకరణ సాధ్యం

జాతీయ ఆదివాసీ సంఘాల జేఏసీ చైర్మన్ లింగయ్య

ఏటూరునాగారం, డిసెంబర్ 22 : సుధీర్ఘ పోరాటాల ద్వారానే ఎస్టీ వర్గీకరణ సాధ్యం అవుతుందని జాతీయ ఆదివాసీ సంఘాల చైర్మన్ చందా లింగయ్య అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో ఆదివారం తుడుందెబ్బ 9వ రాష్ట్ర మహా సభలను సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ అధ్యక్షతన ప్రారంభించగా లింగయ్య హాజరై మాట్లాడారు. 1970 నుంచి ఆదివాసీల హక్కుల కోసం పోరాటం చేయడం వల్లే ఏజెన్సీ ప్రాంతాల్లో చట్టాలు వచ్చాయన్నారు. వాటిని కాపాడుకోవడంలో నేటి యువత విఫలమవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐక్యంగా ఉన్నప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని, సంఘాలు ఆ దిశగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఉపేందర్ మాట్లాడుతూ 1996లో తుడుందెబ్బ ఏర్పడిందన్నారు. ఆదిలాబాద్ నుంచి శ్రీకాకుళం వరకు ఆదివాసీల్లో చైతన్యం నింపి ఆదివాసీ చట్టాలు అమలు చేయడంలో కీలకంగా పనిచేసిందన్నారు. పోడు భూములు సాగు చేసుకుంటున్న ఆదివాసీలకు హక్కు పత్రాలు ఇవ్వాలని, పది ఎకరాలు సాగు చేస్తున్న భూములకు రైతు భరోసా ఇవ్వాలన్నారు. ఐటీడీఏలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు 29 శాఖల ద్వారా సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చిన వారిని గుర్తించి వెంటనే వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. సభకు ముందు వై జంక్షన్‌లోని భీం విగ్రహానికి పూల మాలలు సమర్పించి అక్కడ నుంచి ర్యాలీగా గిరిజన భవన్‌కు వెళ్లారు. కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వట్టం నారాయణ, గొండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ, తుడుందెబ్బ జాతీయ కో కన్వీనర్ యాసం రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొమురం శేషయ్య, రాష్ట్ర, జిల్లా నాయకులు కొమురం ప్రభాకర్, కబ్బాక శ్రావణ్‌కుమార్, గుంపిడి వెంకటేశ్వర్లు, పూనెం బాలకృష్ణ, వట్టం జనార్దన్, చింత కృష్ణ, వట్టం కన్నయ్య, పూనెం శ్రీనివాస్, ధనసరి రామ్మూర్తి, చందా మహేశ్, మహబూబాబాద్, కొత్తగూడెం జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు సువర్ణ పాకం వెంకటరత్నం, చీమల శివకుమార్, దుగ్గిరపు వీరభద్రం, చింత వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ద్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

టేకుమట్ల, డిసెంబర్ 22 : డ్రైంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఒకరిని జైలుకు పంపించినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వాహన తనిఖీల్లో భాగంగా కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండలం వంతడుపుల గ్రామానికి చెందిన పెనుకుల కుమరస్వామి తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. భూపాలపల్లి జిల్లా కోర్టులో నిందితుడిని హాజరుపర్చగా న్యాయమూర్తి అతనికి రెండు రోజుల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విదించగా, పరకాల సబ్ జైల్‌కు తరలించినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపొద్దని, పట్టుబడితే శిక్షలు తప్పవని వాహనదారులకు ఎస్సై సూచించారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

గణపురం, డిసెంబర్ 22: మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన రైతు పెండ్యాల కుమారస్వామికి చెందిన పాడి గేదె ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. బాధిత రైతు కథనం ప్రకారం.. మేతకు వెళ్లిన పాడి గేదె ఆదివారం గ్రామం శివారు పొలాల్లోని ట్రాన్స్ ఫార్మర్ వద్ద మృతి చెంది ఉన్నట్లు చెప్పాడు. గేదె విలువ సుమారు రూ.90వేలు ఉంటుందని ప్రభుత్వం న్యాయం చేయాలని వేడుకున్నాడు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్

కృష్ణకాలనీ, డిసెంబర్ 21: గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన క్రీడల ముంగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై విజేతలకు బహుమతులు, మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో డీఈవో రాజేందర్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్ ఫోన్ అప్పగింత

మహాముత్తారం, డిసెంబర్ 22 : పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను ఎస్సై మహేందర్ ఆదివారం బాధితుడికి అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి.. మహాముత్తారం గ్రామానికి చెందిన పక్కల రాజబాబు బైక్‌పై వెళ్తున్న క్రమంలో సెల్‌ఫోన్ పడిపోయింది. దీంతో బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా కనుగొని బాధితుడికి ఎస్సై అప్పగించారు.

భారీగా గంజాయి పట్టివేత !?

గణపురం, డిసెంబర్ 22 : మండలంలో పోలీసులు భారీగా గంజాయిని పట్టుకున్నట్లు సమాచారం. తెలిసిన వివరాల ప్రకారం.. ఆదివారం పెద్ద మొత్తంలో ఒడిశా నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు నిషేధిత ఎండు గంజాయిని తరలిస్తున్నారనే సమాచారంతో వాహనాన్ని గణపురం పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. కాగా, పోలీసులు అధికారికంగా ఎలాంటి వివరాలు వెల్లడించలేదు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

ఎమ్మెల్యే గండ్రసత్యనారాయణరావు

రేగొండ, డిసెంబర్ 22 : సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరంగా మారిందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. రేగొండ, గోరికొత్తపల్లి మండలాలకు చెందిన 40 మంది లబ్ధిదారులకు ఆదివారం రేగొండ మండలకేంద్రంలోని రైతు వేదికలో ఎమ్మెల్యే సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కారణాలతో అనారోగ్యానికి గురై ఆసుపత్రి పాలైన వారికి రూ.11లక్షల విలువైన చెక్కులు ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ గుంటోజు కిష్టయ్య, నాయకులు మ్యాకల భిక్షపతి, పున్నం రవి, కోలెపాక సాంబయ్య, ఏనుగు రవీందర్‌రెడ్డి, మైస భిక్షపతి పాల్గొన్నారు.

విద్యార్థి అభిరామ్‌కు మెమెంటో అందజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలో విద్యార్థి ప్రతిభ

గణపురం : భూపాలపల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీల్లో మండలకేంద్రానికి చెందిన ఆదర్శ మోడల్ స్కూల్ విద్యార్థి పసునూటి అభిరామ్ ఉత్తమ ప్రతిభ కనబర్చి బహుమతిని గెలుపొందాడు. ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ విద్యార్థికి బహుమతి అందజేశారు.

జేసీబీ సహాయంతో ముళ్ల పొదలను తొలగిస్తున్న పోలీసులు

రహదారిపై ముళ్ల పొదల తొలగింపు

మొగుళ్లపల్లి, డిసెంబర్ 22 : మండలంలోని ముల్కలపల్లి – పర్లపల్లి గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై ముళ్ల పొదలను ఎస్సై బీ అశోక్ జేసీబీ సహాయంతో ఆదివారం తొలగింపజేశారు. వాగు అవతలి గ్రామాలకు ప్రధాన రహదారి కావడంతో నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. రహదారిని అనుకొని ముళ్ల పొదలు ఏపుగా పెరగడంతో వాహనదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోలీసులు స్పందించి తొలగించడంతో రైతులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మేడిగడ్డ బరాజ్‌కు 12,744 క్యూసెక్కుల వరద

మహదేవపూర్, డిసెంబర్ 22 : మేడిగడ్డ (లక్ష్మీ) బరాజ్‌కు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఆదివారం 16.17 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉన్న బరాజ్‌కు ఇన్‌ఫ్లో 12,744 క్యూసెక్కుల ప్రవాహం రాగా, 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుత వరద ప్రవాహం రివర్ బెడ్ నుంచి సముద్ర మట్టానికి 89.30 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తున్నది. ప్రవాహం తగ్గే అవకాశం ఉన్నట్లు భారీ నీటి పారుదల శాఖ అధికారులు చెప్పారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

వేద గణిత పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

గణపురం, డిసెంబర్ 22: వరంగల్ జిల్లా పరకాలలో జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా ఆదివారం జరిగిన జోనల్ స్థాయి అబాకస్, వేద గణిత పోటీల్లో మండలకేంద్రంలో శ్రీ నారాయణ హై స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు యాజమాన్యం తెలిపింది. పోటీల్లో టీ యోగశ్రీ ద్వితీయ ర్యాంకు, జూనియర్ లెవల్-1లో హంసిక ప్రథమ ర్యాంకు, అబాకస్ పోటీల్లో సీనియర్ లెవల్-4లో సీహెచ్ అక్షయ ద్వితీయ ర్యాంకు సాధించారు. వారికి నిర్వాహకులు ప్రమోద్ చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఎన్ రవి, కరస్పాండెంట్ అనిశెట్టి భానుచందర్, ప్రిన్సిపాల్ అనిశెట్టి ప్రవంతి, ఉపాధ్యాయులు శిరీష, రమ,ప్రశాంత్ పాల్గొన్నారు.

టీ చేస్తూ నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

టీ చేస్తూ సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన

ములుగురూరల్, డిసెంబర్ 22 : కలెక్టరేట్ కార్యాలయ సమీపంలో సమగ్ర శిక్షా ఉద్యోగులు ఆదివారం టీ తయారు చేసి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సోమిడి కరుణాకర్, కోశాధికారి కుమార్‌పాడ్యా, ఉపాధ్యక్షుడు ఎండీ ఫిరోజ్, కార్యవర్గ సభ్యులు సుజాత, రమేశ్, రాజేశ్వరి, ప్రవీణ్, చిరంజీవి, నీలంబాబు, రమేశ్, వసంతరావు, సంజీవ, గంగాధర్, సుబ్బారెడ్డి, కల్యాణి, రవికుమార్, ఉమాదేవి, మమత, నరేశ్, చందన, శారధ, వనిత పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితితో ఒకరు మృతి

దర్యాప్తు చేస్తున్న ములుగు పోలీసులు

ములుగురూరల్, డిసెంబర్ 22 : అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతి చెందిన ఘటన ములుగు జిల్లా కేంద్రం పరిధి బండారుపల్లి రోడ్డు వైపు ఉన్న వెంచర్‌లో ఆదివారం ఉదయం వెలుగుచూసింది. అటుగా వెళ్తున్న ఓ వ్యక్తి గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై వెంకటేశ్వరరావు, ఎస్సై-3 లక్ష్మారెడ్డి అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్థానికులతో పాటు అంతర్ రాష్ట్ర కార్మికులను పిలిపించి ఆరా తీశారు. మృతుడిని జేబులో దొరికిన డ్రైవింగ్ లైసెన్స్ ఆధారంగా మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలానికి చెందిన ఓర్సు శ్రీనివాస్ (40)గా గుర్తించారు. మధ్యాహ్న సమయంలో పస్రా సీఐ రవీందర్ సైతం అక్కడికి చేరుకున్నారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీమ్‌లు ఆధారాలను సేకరించాయి. విషయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడు శ్రీనివాస్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలానికి చెందిన లింగారావు అనే వ్యాపారి వద్ద ఇసుక లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు తెలిసినట్లు పోలీసులు తెలిపారు. లింగారెడ్డిని సైతం పిలిపించి విచారణ చేయగా మృతుడు రెండు, మూడు రోజుల నుంచి తన వద్దకు పనికి రావడం లేదని తెలిపాడని, ప్రస్తుతం హనుమకొండలో ఉంటున్నట్లు చెప్పినట్లు పేర్కొన్నారు. మృతుడి కుటుంబ సభ్యులు వచ్చిన అనంతరం కారణాలు తెలిసే అవకాశం ఉందని, వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ ముమ్మరం చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. ఇది ఇలా ఉండగా చెన్నూరుకు చెందిన శ్రీనివాస్ శనివారం ఎందుకు వచ్చాడు..? అతడిని ఎవరైనా హత్య చేశారా? ఘటనా స్థలంలో మద్యం బాటిల్, కల్లు బాటిల్, బీరు బాటిల్ ఎందుకు ఉంది..? అతని స్మార్ట్ ఫోన్ డిస్‌ప్లే లేకుండా రాళ్లలో ఎందుకు పడి ఎందుకు ఉంది..? మృతుని ముఖంపై రాయితో కొట్టిన గాయాల ఆనవాళ్లు ఎందుకు ఉన్నాయ నేది పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నేటి నుంచి ఐటీడీఏ ఎదుట సీఆర్‌టీల సమ్మె

ఏటూరునాగారం, డిసెంబర్ 22 : ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న సీఆర్‌టీలు నేటి (సోమవారం) నుంచి ఐటీడీఏ కార్యాలయం ఎదుట సమ్మె నిర్వహించేందుకు సన్నద్ధమయ్యారు. ఇందుకు అధికారులు సహకరించాలని, తమ సమస్యలు పరిష్కరించాలని సీఆర్‌టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొదెం రవీందర్, జిల్లా అధ్యక్షుడు కొండ రామయ్య కోరారు. 20 ఏండ్లుగా విధులు నిర్వర్తిస్తున్న తమకు ఎలాంటి షరతులు లేకుండా సర్వీసును క్రమబద్ధీకరించాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా వేతనాలు చెల్లించాలని, మహిళా సీఆర్‌టీలకు 180 రోజులు ప్రసూతి సెలవులు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐటీడీఏల వద్ద సమ్మె చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

సబ్సిడీపై వరి విత్తనాలు

గోవిందరావుపేట, డిసెంబర్ 22 : మండలంలోని రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు అందించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి జితేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత యాసంగి సీజన్‌కు జాతీయ ఆహార భద్రత పథకం కింద రైతులను వరి సాగులో ప్రోత్సహించేందుకు సబ్సిడీపై వరి విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఆర్ఎన్ఆర్ 15048 (తెలంగాణ సోన) 15 కిలోల సంచి సబ్సిడీ పోను రూ.297, ఎంటీయు 1010 20 కిలోల బ్యాగు రూ.745, కేఎన్ఎం 118 రూ.495కు అందించనున్నట్లు పేర్కొన్నారు. విత్తనాలు కావాల్సిన వారు రైతు పట్టా పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ వెంట తెచ్చుకోవాలని సూచించారు.

కేంద్ర మాజీ మంత్రి వెంకటస్వామి వర్ధంతి

ములుగురూరల్/ భూపాలపల్లి రూరల్/ ఏటూరునాగారం, డిసెంబర్ 22 : ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల కలెక్టరేట్లలో ఆదివారం మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి వర్ధంతి నిర్వహించారు. భూపాలపల్లి కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ములుగు కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఏటూరునాగారం ఐటీడీఏలో వెంకటస్వామి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాలర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఐటీడీఏ ఏపీ రాజ్‌కుమార్, అక్కౌంట్స్ మేనేజర్ నర్సింహ, పెసా కో ఆర్డినేటర్ ప్రభాకర్, కిరణ్, ఈసం విశ్వనాధం, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పులిశె బాలకృష్ణ, ఆయా కలెక్టరేట్లలోని అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూపాలపల్లి రూరల్ : వెంకటస్వామి వర్ధంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, అధికారులు

శ్రీనివాస రామానుజన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 22 : శ్రీనివాస రామానుజన్‌ను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని సింగరేణి భూపాలపల్లి జీఎం రాజేశ్వర్ రెడ్డి అన్నారు. ఆదివారం జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా సింగరేణి ఉన్నత పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు నిర్వహించగా జీఎం హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్‌ను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని గణితంపై భయం పోగొట్టుకుని, నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో క్విజ్, డ్రాయింగ్, వక్తృత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం జానీ రాణి, గణిత ఉపాధ్యాయులు శ్రీనివాస్, మారుతి, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ మురళి పాల్గొన్నారు.

టీ చేస్తూ నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

టీ చేస్తూ సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన

ములుగురూరల్, డిసెంబర్ 22 : కలెక్టరేట్ కార్యాలయ సమీపంలో సమగ్ర శిక్షా ఉద్యోగులు ఆదివారం టీ తయారు చేసి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సోమిడి కరుణాకర్, కోశాధికారి కుమార్‌పాడ్యా, ఉపాధ్యక్షుడు ఎండీ ఫిరోజ్, కార్యవర్గ సభ్యులు సుజాత, రమేశ్, రాజేశ్వరి, ప్రవీణ్, చిరంజీవి, నీలంబాబు, రమేశ్, వసంతరావు, సంజీవ, గంగాధర్, సుబ్బారెడ్డి, కల్యాణి, రవికుమార్, ఉమాదేవి, మమత, నరేశ్, చందన, శారధ, వనిత పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOTS FOR SALE

★80% బ్యాంకు లోన్‌తో వరంగల్ హైవే ఆనుకొని గేటెడ్ కమ్యూనిటీ DTCP అప్రూవ్డ్ ప్లాట్స్, కంప్లీట్ CC రోడ్స్, ఎల్ఇడి, అండర్ గ్రౌండ్ డ్రై